క్లుప్తంగా

పంటలకు మద్దతు ధర కల్పించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు: రైతులు పండించిన పంటలకు కూటమి ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కోటవీధిలోని రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 26న జరిగే మహా ధర్నా కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా తలపెట్టిన మహా ధర్నాను విజయవంతం చేయాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారస్ మేరకు 60 ఏళ్ల దాటిన రైతులందరికీ రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు, పేద మహిళలకు న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రైతు సంఘం నాయకులు స్వామన్న, అయ్యప్పరెడ్డి, వెంకటరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణాలు పూర్తి చేయాలి

ఆత్మకూరు: మండలంలోని వడ్ల రామాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణాలను పూర్తి చేసి, తరగతులు నిర్వహించేలా చూడాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జిల్లా కార్యదర్శి ఎస్.నాగార్జున కోరారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో రెవెన్యూ డివిజన్ అధికారికి వినతి పత్రం అందజేశారు. పాఠశాల భవన నిర్మాణం పనులు పూర్తిగాకపోవడంతో విద్యార్థులు ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే అధికారులు భవన నిర్మాణం పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసా మండల నాయకులు చరణ్, బాలు, రాజు పాల్గొన్నారు.

మసీదులో చోరీ



మసీదు గేటు తాళం పగలగొట్టిన దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామంలో చిన్నపేటలోని మసీదులో సోమవారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారని స్థానికులు తెలిపారు. దుండగులు మసీదులో ఉంచిన గ్యాస్‌సిలిండర్, ఒక బియ్యం బస్తాను ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.5వేలు ఉండవచ్చునని గ్రామస్తులు తెలిపారు. ఇదిలా ఉండగా వరుస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

మహాప్రదర్శనను విజయవంతం చేయండి

పాములపాడు: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న మహాప్రదర్శనకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాజు, ఏపీ రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పన్నులు కట్టేది ప్రజలైతే లాభాలు పొందేది మాత్రం కాంట్రాక్టర్లు అని, బ్యాంక్‌లలో డిపాజిట్లు చేసేది సామాన్య, మధ్యతరగతి ప్రజలైతే భారీగా రుణాలు పొందేది, రుణమాఫీలు కార్పొరేట్ సంస్థలకని విమర్శించారు.

విద్యుత్ మోటార్‌కు మరమ్మతు

పాములపాడు: స్థానిక శివాలయం వద్ద ఉన్న తాగునీటి విద్యుత్ మోటార్‌కు సోమవారం మరమ్మతులు చేయించారు. కొన్ని రోజులుగా మోటార్ పనిచేయకపోవడంతో గ్రామంలోని బీసీ కాలనీకి నీటి సరఫరా స్తంభించిపోయింది. దీంతో సర్పంచ్ మేకల భాగ్యమ్మ వెంటనే చర్యలు చేపట్టి తాగునీటి మోటార్‌కు మరమ్మత్తులు చేయించి యథావిధిగా గ్రామంలోనికి నీటి సరఫరా చేశారు.

అదానీని అరెస్ట్ చేయాలి

పగిడ్యాల: దేశ, రాష్ట్ర సంపదను లూటీ చేస్తున్న పారిశ్రామికవేత్త అదానీని అరెస్ట్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టిన అనంతరం తహసీల్దార్ శివరాముడుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీకి అత్యంత సన్నిహితుడైన అదాని సౌర విద్యుత్ కాంట్రాక్టర్లను దక్కించుకోవడం కోసం ఉన్నత స్థాయి వ్యక్తులకు ముడుపులు అప్పగించారని వస్తున్న వార్తలపై ప్రధాని స్పందించాలని డిమాండ్ చేశారు. అదాని అవినీతి సామ్రాజ్యానికి ప్రధాని అండదండలు పుష్కలంగా ఉండడం శోచనీయమని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తిక్కస్వామి, ఉసేనమ్మ, ఈశ్వరమ్మ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక సందడి

శైవ క్షేత్రాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కార్తీక కడ సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఓంకారం, మహానంది క్షేత్రాలు కిక్కిరిశాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న శివాలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు.

- ఓంకారానికి పోటెత్తిన భక్తులు
- కడ సోమవారం కావడంతో కిక్కిరిసిన శివాలయాలు



ఓంకారంలో పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



దర్శనార్థం క్యూలైన్లలో ఉన్న భక్తులు

బండిఆత్మకూరు: మండల పరిధిలోని గంగా ఉమా సమేత ఓంకారేశ్వరాలయానికి కార్తీక మాస నాల్గవ సోమవారం కావడంతో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు పంచముగ్గల కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించి ఓంకార సిద్దేశ్వర స్వామిని, అమ్మవారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. ఆంజనేయ స్వామి, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను సందర్శించారు. ఆలయ ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

కొత్తపల్లి: కార్తీకమాసం చివరి దశకు చేరుకుంది. చివరి సోమవారం కావడంతో భక్తులు మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రాలైన సంగమేశ్వరం, కొలనుభారతి దేవి ఆలయాలను సందర్శించారు. కొలనుభారతిదేవి ఆలయంలో సరస్వతిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అదేవిధంగా రెండు తెలుగురాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు సంగమేశ్వరంలో భక్తిశ్రద్ధలతో చివరి కార్తీక సోమవారం పూజా కార్యక్రమాలు చేసుకున్నారు. కృష్ణానదిలో పున్యస్నాలతో సంగమేశ్వరం పుష్కరఘాట్ కిక్కిరిసి పోయింది. ఎగువ పుష్కర ఘాట్‌లో శ్రీలలితా సంగమేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు, బ్రహ్మసూత్ర ప్రాచీన శివలింగ పరమేశ్వరుడికి, లలితాదేవిలకు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం గోధూళి వేళ సోమప్రదోష సమయంలో ఉత్సవమూర్తులకు తలంబ్రాల కార్యక్రమం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ సంప్రదాయ బద్ధంగా చేపట్టారు.



సంగమేశ్వరంలో శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం చేస్తున్న భక్తులు



ఉమామహేశ్వరాలయం ప్రాంగణంలో కోలాటం ఆడుతున్న భక్తులు

మహానందీశ్వర క్షేత్రంలో..



మహానందీశ్వర స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

మహానంది: వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. 55 మంది భక్తులు రుద్రాభిషేకం పూజలు జరిపించుకున్నారు. ఉచిత దర్శనం క్యూలైన్లో భక్తులు ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి నిలబెట్టడంతో ఆలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు సరైన స్థలం, సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని వాహనాలను ఆలయ ప్రాంగణంలో ఎక్కడపడితే అక్కడ నిలపడంతో కాలినడకన వెళ్లే భక్తులు కూడా ఇబ్బందులు పడ్డారు.

రుద్రకోడు పుణ్యక్షేత్రంలో..

ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలోని రుద్రకోడు పుణ్యక్షేత్రానికి కార్తీకమాసం చివరి సోమవారం భక్తులు పోటెత్తారు. రుద్ర కోటేశ్వరస్వామి, రుద్రాణి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. కాగా ఎన్నడూ లేని విధంగా వాహనాలకు రూ.300 చొప్పున వసూలు చేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



దీపాలు వెలిగించిన మహిళ



పగిడ్యాలలో వనభోజన కార్యక్రమానికి తరలి వచ్చిన భక్తులు

బంగ్లా కట్ట శివాలయానికి కార్తీక శోభ

పగిడ్యాల: కార్తీక మాసం నాల్గవ సోమవారాన్ని పురస్కరించుకుని స్థానిక బంగ్లా కట్ట సర్వేశ్వరస్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి పోటెత్తడంతో శివనామ స్మరణ మారుమోగింది. అర్చకులు వీరస్వామి భక్తుల చేత శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో పూజలు జరిపించారు. ఉసిరి చెట్టు కింద పార్వతీదేవి, సర్వేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు కనుల పండువగా కళ్యాణ మహోత్సవ వేడుకలను జరిపించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు బన్నూరు వంశీయులు వనభోజన కార్యక్రమాలు చేపట్టి ఆనవాయితీని కొనసాగించారు.

పంట బీమాతో రైతులకు రక్ష

వెలుగోడు: పంట బీమాతో రైతులకు ఎంతో మేలు అని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. మండలంలోని గుంతకందాల, వెలుగోడు పరిధిల్లోని వరి పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నామన్నారు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాలు దిగుబడులు వస్తున్నాయన్నారు. రైతులు రబీలో సాగుచేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంట బీమా చేసుకోవాలని రైతులకు సూచించారు. అకాల వర్షాలకు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పుడు పంట నష్టపోయిన రైతులకు బీమా రక్షణగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అంజిత్ కుమార్, వ్యవసాయ విస్తరణ సిబ్బంది అప్సర్, అర్పత్ పాల్గొన్నారు.



వరి పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ

ఘనంగా సెమీ క్రిస్మస్



వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మారుఫ్‌ఆసియా

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్‌పీజీ పాలెం సీఎస్ఐ చర్చిలో సోమవారం సెమీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారుఫ్‌ఆసియా హాజరై క్రిస్మస్ కేకును కట్ చేసి సండే స్కూల్ పిల్లలకు గిఫ్ట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

సమీక్ష సమావేశం

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ డీఈ నాగరాజు, ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ వంద రోజుల సెకండ్ స్పెల్ టార్గెట్‌ల గురించి, 2.0 రిజిస్ట్రేషన్, ఎన్ఆర్ఈజీఎస్ పనిదినాల నమోదు గురించి చర్చించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు, ఏపీఓ విమలమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ నాగరాజు

నేడు కార్యకర్తలతో శిల్పా సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమావేశమవుతారని ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు. ఏవైనా సమస్యలున్న ప్రజలు కూడా శిల్పాను కలిసి విన్నవించుకోవచ్చన్నారు.

తిమ్మనపల్లె విద్యార్థి ప్రతిభ



మనోజ్ శివకుమార్

వెలుగోడు: మండలంలోని తిమ్మనపల్లె గ్రామానికి చెందిన విద్యార్థి మనోజ్ శివకుమార్ రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గురురాజ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న మనోజ్‌శివకుమార్ ఈనెల 20న కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -19 బేస్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పాములపాడు: ఈ నెల 29వ తేది వరకు నిర్వహించే మొబైల్ ఆధార్ ప్రత్యేక క్యాంప్‌ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. ఈనెల 26న పాములపాడు, 27న భానుముక్కల, 28న కొత్త బానకచర్ల, 29న వేంపెంట గ్రామ పంచాయతీల వారీగా ఆధార్ క్యాంప్‌లు ఉంటాయన్నారు.

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మేరి సూచించారు. 26న ముసలిమడుగు, ఎర్రమఠం, 27న పెద్దగుమ్మడాపురం, 28న శివపురం, 29న గోకవరం గ్రామ సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: రాష్ట్రంలో రాబోవు 2, 3 రోజుల్లో తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ తెలిపారు. ఈ తుపాన్ ప్రభావంతో ఈదురు గాలులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని వివరించారు. రైతులు కోతకి సిద్ధంగా ఉన్న వరి పంటని వర్షాలకు ముందు కోయరాదని సూచించారు. పూర్తిగా ఆరని పన్నలను కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును వాటిపై చల్లుకుంటూ కుప్పవేసుకోవాలని వివరించారు. గింజ తడిచినట్లయితే మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పన్నలపై ఉండేవిధంగా పిచికారీ చేయాలని సూచించారు.

ముగ్గురు యువకులకు గాయాలు

మహానంది: మహానందీశ్వర స్వామి దర్శనం అనంతరం ఇంటికి వెళ్తుండగా ఎదురెదురుగా వెళ్తున్న కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. గోస్పాడు మండలం సాంబవరం గ్రామానికి చెందిన నాగ చంద్రుడు, మోహన్, సురేంద్ర సోమవారం మహానంది నుంచి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు టైర్ పంక్చరై బైకుకు ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. కారులో ఉన్న సంగారెడ్డి జిల్లా తొగరుపల్లికి చెందిన శ్రీనివాస్, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు, పోలీసులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

జానాల గూడేనికి విద్యుత్ లైన్ ఏర్పాటు

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం గ్రామ పంచాయతీ మజరా గ్రామమైన జానాల గూడేనికి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ సుధాకర్ కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని జానాలగూడెంను ఏడీ రామసుబ్బయ్యతో కలసి పరిశీలించారు. ముందుగా విద్యుత్ లైన్ ఎక్కడా వస్తుంది అన్న విషయాలను తెలుసుకున్నారు. గ్రామస్తులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈ మాట్లాడుతూ సంగమేశ్వరం నుంచి జానాల గూడెం వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర విద్యుత్‌లైన్ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయన్నారు. ఈ విద్యుత్ లైన్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రూ.96 లక్షల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. 7 కి.మీ లలో 278 విద్యుత్ స్తంభాలు, 11 కేవీ లైన్, సింగల్‌ఫేస్ 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 4 ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పనులను త్వరలోనే చేపడతామని చెప్పారు. డీఈ జయశంకర్, ఏఈ అబ్దుల్ అబీద్ ఉన్నారు.



జానాలగూడెం వాసితో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ సుధాకర్ కుమార్

ఆలయ భూమిని స్వామి పేరిట ఆన్‌లైన్ చేయండి



తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేస్తున్న రెడ్డివారి సోమసుందర్ రెడ్డి

మిడుతూరు: పీరుసాహెబ్ పేట గ్రామంలో ఇటీవల పునఃనిర్మించిన శ్రీ కాశీ విశ్వేశ్వర సహిత శ్రీ రామకృష్ణదేవాలయం, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాలకు సుమారు 100 సంవత్సరాల క్రితం తమ పూర్వీకులు దాదాపు 11 ఎకరాల భూములను స్వామివారి ఆలయాల (శ్రీ ఆంజనేయ, ఈశ్వర స్వామి, రామచంద్ర స్వామి) పేరిట గతంలోనే రిజిష్ట్రేషన్ చేయించి ఉంచినట్లు రెడ్డి వారి వంశానికి చెందిన రెడ్డివారి సోమసుందర్‌రెడ్డి తెలిపారు. రానున్న కాలంలో ఈ భూమి అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా రెవెన్యూ రికార్డుల్లో, ఆన్‌లైన్‌లో స్వామివారి పేరు మీదనే నమోదు చేయాలని కోరారు. కాగా, రెడ్డివారి శివ గంగాధర రెడ్డి పేరు మీద 1.33 సెంట్ల భూమి ఆన్‌లైన్‌లో ఉందని, అతను మాత్రమే స్వామివారి పేరిట ఆన్‌లైన్‌లో నమోదుకు ఒప్పుకోవడం లేదన్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి సదరు భూమిని కూడా స్వామివారి పేరిటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ దశరథరామయ్యకు విన్నవించారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ స్వామివారి భూములకు సంబంధించిన ఆ వ్యక్తి పేరు మీద ఉన్న ఆలయ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను ఆర్డీఓ, జేసీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

29న జాబ్‌మేళా



కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: ఈ నెల 29వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహిస్తునట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, కేఎల్ గ్రూప్, త్రీ క్వీస్ కార్పొరేషన్‌కు చెందిన ప్రతినిధులు జాబ్‌మేళాకు వస్తున్నారన్నారు. పది, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. సమాచారం కోసం 91548 30286, 91822 17075 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉచిత న్యాయ సలహాపై అవగాహన కల్పించాలి

ఆత్మకూరు: వివిధ నేరాలలో ఆరోపణలు ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉన్న నిందితులకు ఉచిత న్యాయ సలహాపై అవగాహన కల్పించాలని ఆత్మకూరు కోర్టు ఏపీపీ మైలాబాబు రాజేంద్రప్రసాద్ పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం ఫారెస్ట్ రేంజి ఆఫీసర్స్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్, ఎక్సైజ్‌శాఖ, సీఐలు, ఎస్‌లతో స్థానిక కోర్టు ఆవరణలో సమావేశమై చట్టాలపై ఏపీపీ వివరించారు. సమావేశంలో ఫారెస్ట్ రేంజ్ ఆ ఫీసర్, రామకోటి, ఎస్ఐ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీపీ మైలాబాబు రాజేంద్రప్రసాద్

నిత్యావసర సరుకుల అందజేత

కొత్తపల్లి: అన్ని అర్హతలు ఉన్నా ప్రభుత్వ ఫలాలు అందుకోలేకపోతున్న వికలాంగురాలైన భ్రమరాంబ చెంచుగూడెంకు చెందిన గిరిజన మహిళ కొత్తపాటి బయ్యమ్మ కుటుంబానికి గిరిజన సంఘం నాయకుడు జవహర్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉన్నా ప్రభుత్వం పింఛన్ ఇవ్వకపోవడంతో గూడెంలోని బయ్యమ్మ కుటుంబం తినడానికి తిండిలేక, ఉండడానికి ఇల్లులేకపోవడంతో బాధపడుతోందన్నారు. దీంతో ఆత్మకూరు మండలం ఇందిరేశ్వరం గ్రామ గిరిజనులు సేకరించిన 100 కిలోల బియ్యం, కిరాణం సరుకులు, కూరగాయాలు, రూ.2వేలు అందించామన్నారు. ఇలాంటి కుటుంబాలను ఆదుకొనేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు ఈశ్వర్ నాయక్, కృష్ణయ్య, నాగరాజు నాయక్, కృష్ణకాంత్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.



గిరిజన మహిళ బయమ్మ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

మార్చి నెలాఖరులోగా ఇళ్లు నిర్మించుకోవాలి

జూపాడుబంగ్లా: 2025 మార్చి నెలాఖరులోగా పక్కాగృహాలు నిర్మించుకున్న వారికే బిల్లులు మంజూరు అవుతాయని హౌసింగ్ ఏఈ జ్యోతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు మండలంలోని 11 జగనన్న కాలనీలలో 408 పక్కాగృహాలు మంజూరు అయ్యాయన్నారు. వాటిలో ఇప్పటిదాకా 253 ఇళ్లు పూర్తి అయ్యాయని చెప్పారు. మిగిలిన వాటిలో బీబీఎల్ 10, బీఎల్ 56, ఎల్ఎల్ 48, ఆర్ఎల్31 చొప్పున వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇప్పటిదాకా 50 శాతం పక్కాగృహాలను పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వారు వచ్చే ఏడాది మార్చి నెల ఆఖరిలోగా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆ తర్వాత నిర్మించుకునే గృహాలకు బిల్లులు మంజూరు కావని స్పష్టం చేశారు. వీటితోపాటు 2016 నుంచి 19 వరకు టీడీపీ పాలనలో 852 గృహాలు మంజూరు అయినట్లు తెలిపారు. వాటిలో 198 గృహాలు పూర్తికాగా మిగిలిన గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు.

పోలీసుల అదుపులో ఉల్లిగడ్డల దొంగలు

కొత్తపల్లి: ఎదురుపాడు గ్రామంలో శనివారం రాత్రి ఓ రైతు కళ్లంలో ఉంచిన ఉల్లిగడ్డల సంచులను చోరీ చేసిన దొంగలు పోలీసుల అదుపులో ఉన్నట్లు ఎస్ఐ ఎం.కేశవ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఎదురుపాడు గ్రామానికి చెందిన బోయ రాముడు కళ్లం దొడ్డిలో ఆరబెట్టిన ఉల్లిగడ్డలను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని రైతు ఫిర్యాదు చేశాడన్నారు. దర్యాప్తులో రాబడిన సమాచారం మేరకు సోమవారం దుండగులు ఆటోలో వెళ్తుండగా బావాపురం క్రాస్‌రోడ్డు వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరిలో వడ్డే మధు, షేక్ షాకీర్ ఇద్దరూ కర్నూలు టౌనుకు చెందిన వారని, పూసలపాటి వెంకటేశ్వర్లు ఎదురుపాడు గ్రామానికి చెందినవాడని వివరించారు. వారివద్ద నుంచి రూ.10వేలు విలువచేసే ఐదు సంచుల ఉల్లిగడ్డలను స్వాధీనం చేసుకొని, ఒక బజాజ్ ఆటోను సీజ్ చేశామని వెల్లడించారు.

మల్లన్నను దర్శించుకున్న హోంమంత్రి అనిత

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. శ్రీశైలం చేరుకున్న హోంమంత్రికి భ్రమరాంబా అతిథిగృహం వద్ద జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, దేవస్థాన పీఆర్వో టీ.శ్రీనివాసరావు, రాజగోపురం వద్ద దేవస్థాన సహాయ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె మల్లికార్జు స్వామిని, భ్రమరాంబాదేవిని దర్శించుకున్నారు.

రాష్ట్రాభివృద్ధికి సహకరించాలి

నంద్యాల(రూరల్): రాష్ట్రాభివృద్ధికి అమెరికా తెలుగు అసోసియేషన్ (తానా) సభ్యుల సహకారం ఎంతో అవసరమని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. అమెరికాలో జరుగుతున్న యునైటెడ్ నేషన్స్ జనరల్ 79వ అసెంబ్లీ సమావేశాలకు భారత ప్రతినిధిగా వెళ్లిన ఆమెను సోమవారం తానా సభ్యులు సన్మానించారు. ఆమె మాట్లాడుతూ తానా సభ్యులు మాతృభూమి ఋణం తీర్చుకోవాలని కోరారు.